క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



చెక్కు అందిస్తున్న సత్తిబాబు

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు రూ.1,01,111 విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ బుధవారం తెలిపారు. పెస్టిసైడ్స్ వ్యాపారి కొల్లూరి సత్తిబాబు ఈ విరాళాన్ని అందించారన్నారు. మేకల అన్నవరం, మంతెన సోమరాజు, ఐలూరి విశ్వనాథం, చోడిపిండి సుబ్రహ్మణ్యం, మట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు మేలు



భోగోలులో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ ఫణికుమార్

లింగపాలెం: మండలంలోని రంగాపురం, భోగోలు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఫణికుమార్, మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్‌లు మాట్లాడుతూ పీఎంఎఫ్‌బీవై స్కీమ్‌లోవరి పంట వేసిన ప్రతి రైతు రూ.840 చెల్లించిన బీమా చేయించుకోవాలన్నారు. పచ్చిరొట్ట పైర్లు, కౌలు కార్డుల ఉపయోగాలను వివరించారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని, దీని వల్ల రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకి విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బొంతు సుబ్బారావు, ఒబిలినేని శేషగిరిరావు, గుండ్రాల శేఖర్, రాప్రోలు రామ్మోహనరావు, గిరిబాబు, వెంపాటి సత్యనారాయణ, రైతులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. శివయ్య కల్యాణం



శివ కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఉపాలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని శివ కల్యాణాన్ని, రుద్రాభిషేక వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. ముందుగా అర్చకులు గర్భాలయంలోని స్వామివారి లింగ స్వరూపానికి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవ మూర్తులను ఉంచి అలంకరించారు. అనంతరం అర్చకులు, పండితులు కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విద్యార్థికి కలెక్టర్ సాయం

ఏలూరు(మెట్రో): ఆయన వయసు 72 ఏళ్లు. తన కూతురికి ఇద్దరు పిల్లలు. సుమారు 15 ఏళ్ల క్రితం ఆమె నుంచి భర్త విడిపోయారు. అప్పటి నుంచి ఆ పిల్లలను ఆయనే పోషిస్తున్నారు. చదివిస్తున్నారు. ఈ క్రమంలో తన రెండో మనవడు తాడిగడప మహేష్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి సీటు కోసం కలెక్టర్ కె.వెట్రిసెల్వి వద్దకు వచ్చారు. తన మనవడి చదువు కోసం సాయం చేయాలని కోరారు. వృద్ధుడి అర్జీని పరిశీలించిన కలెక్టర్ తక్షణమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించారు. అడిగిన వెంటనే కలెక్టర్ కె.వెట్రిసెల్వి సాయం చేశారని లింగపాలెం మండలం తిమ్మక్కపాలెంకు చెందిన వృద్ధుడు బుల్లా నాగేశ్వరరావు తెలిపారు.

స్థానిక సమస్యలపై ఏకరువు

ఏలూరు (టూటౌన్): తమ ప్రాంత సమస్యలను తక్షణం పరిష్కరించాలంటూ పోణంగి రోడ్డులోని రాజరాజేశ్వరినగర్ ప్రాంత ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు మొరపెట్టుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు డిప్యూటీ కమిషనర్ పి.శివారెడ్డి బుధవారం సాయంత్రం ఆ ప్రాంతంలో పర్యటించారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పేరుకు పోవడంతో వర్షం నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్డుపైనే నిలిచిపోతున్నాయని స్థానికుడు, సామాజిక కర్యకర్త ఎండీ ఇస్మాయిల్ షరీఫ్ డిప్యూటీ కమిషనర్ శివారెడ్డికి వివరించారు. తమ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న కుక్కలు, పశువుల బెడద అరికట్టాలని, పశువుల దొడ్డిని ఏర్పాటు చేయాలని కోరారు. తమకు సమీపంలో ఉన్న కంపోస్టు యార్డు నుంచి వచ్చే దుర్గంధం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ముమ్మరంగా ఖరీఫ్ వరి నాట్లు

- అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలు
- సబ్‌డివిజన్‌లో 18, 384 హెక్టార్లలో సాగు
- సాగు పనుల్లో మెట్ట రైతులు బిజీబిజీ



రాఘవాపురం గ్రామంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గంలో వరి నాట్లు వేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జూన్ నెలలో వర్షాభావం ఉన్నప్పటికీ జూలై నెలలో సాధారణ వర్షపాతం నమోదు కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు కొనసాగుతుండటంతో నూరుశాతం ఊడ్పులు జరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మంగళవారం చింతలపూడిలో 22.4 మి.మీ, జంగారెడ్డిగూడెం మండలంలో 44.4 మి.మీటర్లు, కామవరపుకోట మండలంలో 17.4 మి.మీ., లింగపాలెం మండలంలో 16.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా వ్యవసాయ విద్యుత్ బోర్ల క్రింద పోసిన నారుమడులు ఏపుగా ఎదిగి నాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గ పరిధిలో 18,384 హెక్టారుల్లో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో చింతలపూడి మండలంలో అత్యధికంగా 7,603 హెక్టార్లు, లింగపాలెం మండలంలో 3,072 హెక్టార్లు, కామవరపుకోట మండలంలో 2,457 హెక్టార్లు, జంగారెడ్డిగూడెం మండలంలో 5,252 హెక్టారుల్లో వరి పంట సాగు చేస్తారు. గత మే నెలలోనే వ్యవసాయశాఖ ద్వారా రైతులకు సబ్సిడీపై 3,152 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేశారు.

లక్ష్యం పూర్తి చేస్తాం



సబ్‌డివిజన్‌లో ఈ ఏడాది నూరు శాతం నాట్లు వేసే అవకాశం ఉంది. జూలై నెలాఖరు వరకు వర్షాలు కురుస్తూనే ఉంటాయి. సాగు లక్ష్యం పూర్తవుతుంది. అల్ప పీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు నెలాఖరు లోగా నాట్లు వేసుకోవడంపూర్తి చేసుకోవాలి. రైతులు భూసార పరీక్షల ఫలితాలను అనుసరించి సూక్ష్మ పోషక లోపాలను అధిగమిస్తూ ఎరువుల యాజమాన్యం చేపట్టాలి. ముఖ్యంగా యంత్రాలతో ప్లాంటేషన్, వెదజల్లే పద్ధతుల్లో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు.

– వై.సుబ్బారావు, ఏడీఏ, వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్

ఏలూరు డివిజన్‌లోకి మార్చాలి

చింతలపూడి: చింతలపూడి, లింగపాలెం మండలాలను ఏలూరు డివిజన్‌లోకి తిరిగి మార్చాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే ఆజాద్ బాబు, సీపీఐ, సీపీఎం నాయకులు హోం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. చింతలపూడిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం పాల్గొన్నారు. స్థానిక ఆంధోని నగర్‌లో పర్యటించారు. అనంతరం చింతలపూడి ఆర్‌కే కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు తలారి ప్రకాష్‌పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య, వివిధ ప్రజాసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈనెల 4న కామవరపుకోట గ్రామానికి చెందిన ప్రకాష్‌పై అదే గ్రామానికి చెందిన షేక్ సైదులు, షేక్ అమ్ము, షేక్ సలీమ్ అనే వారు ఒక స్థల వివాదం గూర్చి మాట్లాడదామని పిలిచి, కులంపేరుతో దూషిస్తూ దాడి చేశారని పేర్కొన్నారు. దాడి చేసిన ముగ్గురిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సముద్రాల సుందరరావు, సాలి రాజశేఖర్, టి.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ



జంగారెడ్డిగూడెం : కనకదుర్గమ్మకు సారె సమర్పించిన భక్తులు



కొయ్యలగూడెం : చింతాలమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు



టి.నరసాపురం : అమ్మవారికి సారె తీసుకెళుతున్నమహిళలు

జంగారెడ్డిగూడెం: ఆషాఢ మాసం ఆఖరిరోజు సందర్భంగా స్థానిక రామచంద్రపురంలో గ్రామ దేవత గంగానమ్మ గుడిలో అమ్మవారికి మహిళలు బుధవారం పసుపు నీటితో జలాభిషేకం చేశారు. శ్రీ కోదండరామాలయం గర్భగుడిలో ఉన్న సీతమ్మ ఉపాలయమైన కనకదుర్గమ్మ, గ్రామ దేవత గంగానమ్మవార్లకు సారె చీర సమర్పించారు. తొలుత మహిళలు మేళతాళాల నడుమ స్థానిక ఆటోనగర్ వద్ద గల కనకదుర్గమ్మ ఆలయానికి సారెతో వెళ్లి అక్కడ పూజలు చేశారు. తిరిగి రామచంద్రాపురం కోదండ రామాలయానికి చేరుకుని గంగానమ్మ, కనకదుర్గమ్మ, సీతమ్మలకు సారెను సమర్పించుకున్నారు. కనకదుర్గమ్మను శాకంబరిగా అలంకరించారు. ఆలయంలో లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ ఆలయ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు పరిమి ధర్మరాజు, విజయభారతి, పరిమి సత్యనారాయణ (సత్తిపండు), కమిటీ అధ్యక్షులు మోతుకూరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం హై స్కూల్ వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ వారిచే స్వామివారి సన్నిధిలో సుమారు 1700 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి తొర్లపాటి నాగరాజు దంపతులు, గుత్తికొండ సత్యనారాయణ దంపతులు, ఎం చిన్న గనేశ్వరావులు దాతలుగా వ్యవహరించారని అన్నప్రసాద వితరణ కమిటీ తెలిపింది.

అయ్యప్పకు పూజలు

జంగారెడ్డిగూడెం మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

చింతాలమ్మకు సారె సమర్పణ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీచింతాలమ్మవారికి మహిళలు చీర, సారే సమర్పించుకున్నారు. మహిళలు తమ ఇళ్ల వద్ద పిండివంటలు చేసి చీర, రవిక, ఇతర సారే పసుపు కుంకుమతో సహా సామగ్రిని ఆలయం వద్దకు తీసుకువచ్చి నైవేద్యంగా సమర్పించారు. అక్కడి నుంచి గణేష్ సెంటర్‌లోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. తిరిగి మళ్లీ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకొని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. శ్రీ లలితా సహస్ర నామ కోటి పారాయణలో పాల్గొన్నారు.

ముత్యాలమ్మ, సీతమ్మ వార్లకు సారె సమర్పణ

టి.నరసాపురం: స్థానిక లలితాపారాయణం గ్రూపు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు బుధవారం గ్రామ దేవత ముత్యాలమ్మ, సీతమ్మ వార్లకు సారె సమర్పించారు. చీర జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమలతో పాటు స్వీట్లు, పండ్లు, పూలు, చలివిడి మొదలగు వాటిని 31 పళ్లాలతో గ్రామంలో మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించి అమ్మవార్లకు సారె సమర్పించారు. అనంతరం వాటిని గ్రామంలోని అన్ని ఆర్యవైశ్య కుటుంబాలకు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు గోతులు పూడ్చివేత



పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద రోడ్డు గోతులను పూడ్చుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద ధ్వంసమైన రోడ్డును బుధవారం మరమ్మతులు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి, కుండ గోతులను పూడ్చే విధంగా అధికారులను ఆదేశించారు. బుట్టాయగూడెం రోడ్డులోని పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద గుంతలను వెట్ మిక్స్ గ్రావెల్‌తో పూడ్చారు. పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం చేస్తున్నామని, అదే సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు సైతం చేపడుతున్నామని చైర్‌పర్సన్ లక్ష్మి తెలిపారు. గోతులు పూడ్చే పనిని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, కౌన్సిలర్ నేకూరి కిషోర్‌లు పర్యవేక్షించారు.

ఆర్థిక సాయం

కొయ్యలగూడెం: పెరాలసిస్ రావడంతో మంగళగిరిలో చికిత్స పొందుతున్న దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన శివాల సోంబాబుకు కొయ్యలగూడెం మానవత శాఖ సభ్యులు బుధవారం రూ.9 వేలు సాయం అందించారు. దిప్పకాయలపాడులో సోంబాబు కుటుంబీకులకు గెడా సుబ్బారావు, అమీర్ బాషా, తిగిరిపల్లి చంటి అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతిచెందాడు. హెచ్‌సీ ఎస్ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం నూకాలమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న పామర్తి కుమారస్వామికి వివాహమై ఇద్దరు సంతానం ఉన్నారు. మద్యానికి బానిసైన కుమారస్వామి అప్పులుపాలయ్యాడు. అప్పులు తీర్చడానికి భార్యను కొలు డబ్బులు అడగ్గా ఆమె ఇవ్వలేదు. దీంతో మనస్థాపానికి గురై ఈ నెల 8వ తేదీ రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఆయన్ని వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారు జామున మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి సమాచారం, తండ్రి పామర్తి రంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం



సమావేశంలో నినదిస్తున్న ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఆదాని తెస్తున్న స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. స్థానిక ధర్మన్న స్మారక భవనంలో ప్రజా సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ సమావేశం సరియం రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మానుకొండ జీవరత్నం, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు జంపన వెంకటరమణ రాజులు మాట్లాడారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు టీడీపీ, జనసేన పార్టీలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి స్మార్ట్ మీటర్ల తీసుకొచ్చారని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ, పట్టణ గుడిసే వాసుల సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దు కోసం ఉద్యమించాలి

కుక్కునూరు: స్మార్ట్ మీటర్ల రద్దుకు ప్రజలంతా కలిసి ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సమావేశం పార్టీ కుక్కునూరు కార్యాలయంలో బాసిన సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బాగున్న డిజిటల్ మీటర్లను తొలగించి అదాని స్మార్ట్ మీటర్లను ప్రజల అనుమతి లేకుండా బిగిస్తున్నారని, వీటికి సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్ల మీటర్లకు సుమారు రూ.25 వేల కోట్ల భారాన్ని జనం నెత్తినవేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ సంస్థలను తెగ నమ్ముతుందని విమర్శించారు. నాయకులు కట్టం వీరస్వామి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి షేక్ మున్ని, పార్టీ డివిజన్ నాయకులు పెంకె వీరబాబు, సరియం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం



జంగారెడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎండీ రఫీక్

జంగారెడ్డిగూడెం: రాష్ట్రంలో చిల్డ్రన్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ద్వారా సుమారు లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు జమఅతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ రఫీక్ తెలిపారు. స్థానిక అసదుల్లా జమా మస్జిద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇస్లాం ధర్మంలో పర్యావరణ పరిరక్షణకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. చిన్నపిల్లల్లో దేశం పట్ల, మొక్కల పట్ల ప్రేమను పెంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ‘మట్టిలో చేతులు – హృదయంలో దేశం’ నినాదంతో జమాతే ఇస్లామీ హింద్ దేశవ్యాప్తంగా 25 జూన్ నుంచి 25 జూలై వరకు ముస్లిం బాల బాలికలచే పది లక్షల మొక్కలు నాటించే ఉద్యమాన్ని చేపట్టామన్నారు. జంగారెడ్డిగూడెం ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఇన్‌చార్జి హమీద జమ, జనాభా టిక్ టాక్ బాజీ షేక్ ముస్తఫా యాఖుబ్, ముస్తాక్, రషీద్, ఆదిల్, ఉస్మాన్, నల్లజర్ల షరీఫ్ షేక్ సుభాని, నబి మాస్టర్ గౌస్, షబ్బీర్, మహిళా అధ్యక్షులు అయేషా తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుపై నిలదీయండి



ప్రభుత్వ మోసాలపై క్యూ ఆర్ కోడ్లను ప్రదర్శిస్తున్న పార్టీ కన్వీనర్ సత్యనారాయణ, నాయకులు

కామవరపుకోట: సూపర్ సిక్స్ పథకాలు అమలుపై కూటమి నాయకుల నిలదీయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాయాంకుల సత్యనారాయణ సూచించారు. తాడిచర్లలో బాబు ష్యూరిటీ – మోసం గారంటీ కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని, నిరుద్యోగ భృతి ఊసే లేదని అన్నారు. ప్రజలను మోసం చేయడానికే తప్ప, హామీలు అమలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని తెలిపారు. కూటమి నాయకులు గ్రామాల్లోకొస్తే హామీలు నెరవేర్చే విధంగా నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.రామకృష్ణ, చింతలపూడి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు మెరుగు బాబురావు, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, మిడత మారయ్య, మద్ది రామయ్య, మాజీ సొసైటీ చైర్మన్ గుడ్రాల రవి, ఎస్‌కే కరిముల్లా, చింతపల్లి సుధ, కొమ్మిన నరేష్ , పీటర్, ఉప్పలపాటి మోహన్ రావు, నార్ని శీను, పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయిలు చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పోలవరం రూరల్: ఉపాధి కూలీల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏజెన్సీ గిరిజన సంఘం, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు నాయకులు ఎంపీడీఓ శ్రీనివాసబాబుకు వినతిపత్రం అందజేశారు. పది వారాలకు పైగా వేతనాల బకాయి ఉన్నాయని, వ్యవసాయ పనులు లేక, ఉపాధి కూలీ డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కూలీ పనులు 200 రోజులకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు, మిడియం రవి దొర, సవల రాంబాబు, మిడియం పోశారావు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలి

వెంకటరెడ్డిగూడెం గ్రామానికి శ్మశాన స్థలం కేటాయించి షెడ్డు నిర్మించాలని తహసీల్దార్ ఆర్ ఎస్ రాజుకు వినతిపత్రం అందజేశారు. పోలవరం మండలం వింజరం పంచాయతీ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి శ్మశానం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటరెడ్డిగూడెం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో భూ సర్వే



రైతుల సమస్యలను వింటున్న సీసీఎల్ఏ అదనపు ముఖ్య కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, జేసీ ధాత్రిరెడ్డి

భీమడోలు: దేశంలో మొట్ట మొదటిసారిగా ఆధునిక సాంకేతికతను వినియోగించి పారదర్శకంగా భూసర్వేను మన రాష్ట్రంలోనే సగం గ్రామాల్లో పూర్తి చేశారని రాష్ట్ర భూ పరిపాలన శాఖ అదనపు ముఖ్య కమిషనర్, సర్వే శాఖ డైరెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సూరప్పగూడెంలో బుధవారం భూసర్వే నిర్వహణా తీరుపై ఆయన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.ప్రభాకర్‌రెడ్డి రైతుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సభలో లేవనెత్తారు. పాతూరు పరిధిలోని మూడు సర్వే నంబర్లలో తనకు ఎకరం భూమి ఉందని, అదే విధంగా సర్వే తరువాత నా భూమిలో వ్యత్యాసాలు వచ్చాయని వాటిని సరి చేయాలని రైతు కోరారు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటికి సరిహద్దు రాళ్ల వేయాలని రైతులు కోరారు. దీనిపై అదనపు ముఖ్య కమీషనర్, సర్వేశాఖ డైరెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలన్నింటిని పరిష్కారిస్తామన్నారు. జేసీ ధాత్రిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తప్పులు లేకుండా భూ సర్వే చేసేందుకు ఇక్కడ అధికారులు ఎక్కువ సార్లు గ్రామసభను నిర్వహించి, వాటిని సరి చేశారన్నారు. అనంతరం గుండుగొలను జగనన్న కాలనీలోని లేఅవుట్‌ను జేసీ, ఆర్‌డీవోలతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ పి.ధాత్రి రెడ్డి, ఆర్‌డీవో అచ్యుత అంబరీష్, సర్వే శాఖ ఏడీ షేక్ మహ్మద్ అన్సారీ, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, వీఆర్వోలు, సర్వే సిబ్బంది, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శ్రేయస్సే యూటీఎఫ్ లక్ష్యం

ఉంగుటూరు: ఉద్యోగుల శ్రేయస్సు కోసం యూటీఎఫ్ పనిచేస్తుందని మండల నాయకులు అన్నారు. బుధవారం మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు పత్రియ నిర్వహించారు. కైకరం హైస్కూల్‌లో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మస్తాఫా ఆలీ ప్రారంభించారు. ఎ.నారాయణపురం, ఉంగుటూరు, బాదంపూడి ,చిన్న వెల్లమిల్లి గొల్లగూడెం , ఎ. గోకవరం హైస్కూల్సులో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలి

గణపవరం: మహిళా పోలీసులు గ్రామాల్లో రహస్యంగా నిర్వహించే అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని సీఐ నక్కా రజనీకుమార్ అన్నారు. బుధవారం సర్కిల్ పరిధిలోని గణపవరం, నిడమర్రు, చేబ్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల క్రికెట్ బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ జూదాలు, డ్రగ్స్ వినియోగం పెరిగిపోతున్నాయని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించి, వీటి నిరోధానికి కృషి చేయాలన్నారు.